ప్రజాశక్తి
శుక్రవారం 14 జూన్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఉమ్మడి జిల్లాలో 1080 ఖాళీలు?

- రాష్ట్ర వ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సిఎం చంద్రబాబు నాయుడు తొలి సంతకం
- గత ఫిబ్రవరిలో ప్రకటించిన ఖాళీలు 416 - ఎన్నికల షెడ్యూలుతో నిలిచిన ప్రక్రియ
- తాజాగా సిఎం సంతకంతో డిఎస్‌సి అభ్యర్థుల్లో చిగురించిన ఆశలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

డిఎస్‌సి అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం భర్తీ చేయనున్న ఉపాధ్యాయ ఖాళీలు గణనీయంగా పెరిగాయి. మెగా డిఎస్‌సి పేరుతో నూతన సిఎం చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేస్తానని చేసిన వాగ్ధానం మేరకు గురువారం సాయంత్రం వెలగపూడి సచివాలయంలో రాష్ట్రం మొత్తం 16,347 ఖాళీలతో నోటిఫికేషన్ విడుదలకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు జిల్లాల వారీగా ఖాళీలను అధికారికంగా ప్రకటించకపోయినా విశ్వసనీయ సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో దాదాపు 1080 ఖాళీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. త్వరలో ఉద్యోగ విరమణ చేసే వారి సంఖ్యకూడా ఎక్కువగా ఉండటంతో ఈ ఖాళీల సంఖ్య కొంత పెరగవచ్చని భావిస్తున్నారు. దీని ప్రాతిపదికన ఖాళీల సంఖ్యను నిర్ధారించినట్టు తెలిసింది. వచ్చే డిసెంబరు వరకు రానున్న ఖాళీలను ప్రామాణికంగా తీసుకుని నోటిఫికేషన్ సిద్ధం చేసినట్టు సమాచారం.

గత ఫిబ్రవరి 12న వైసిపి ప్రభుత్వం రాష్ట్రం మొత్తం మీద 6100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 416 ఖాళీలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. 416 ఖాళీల్లో ఎస్‌జిటి 109, స్కూలు అసిస్టెంట్స్ 170, టిజిటి 137 ఖాళీలున్నట్టు గత నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తాజాగా ప్రకటించిన మెగా డిఎస్‌సి వివరాల ప్రకారం జిల్లాలో 1080 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. వీటిల్లో సబ్జెక్టుల వారీగా ఖాళీలపై



స్పష్టత రాలేదు. రాష్ట్ర స్థాయిలో ఉన్న ఖాళీల ప్రకారం ఎస్‌జిటిలు స్కూలు అసిస్టెంట్స్, టిజిటిలు పిజిటిలు పిఇటిలు, పిన్సిపల్స్ ఖాళీలపై జిల్లాలో అధికారులు ఇంకా జాబితాలు విడుదల చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు కేవలం 35 రోజుల ముందు నోటిఫికేషన్ విడుదల చేసింది. తరువాత

▶ 2లో

నేడు ఎంబివికెలో పర్సా శత జయంతి సభ

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ

సిఐటియు రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యన్నారాయణ శత జయంతి సభ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. విజయవాడ గవర్నరుపేట రాఘవయ్యపార్క్ సమీపంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) 3వ అంతస్తులో జరిగే ఈ సభలో ప్రధాన వక్తగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పాల్గొంటారు. ఈ మేరకు సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఐటియు శ్రేణులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

పింఛను రూ.4 వేలకు పెంపు

మూడు నెలలకు రూ.3 వేలు కలిపి జులైలో రూ.7 వేలు ఇవ్వనున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



సామాజిక పింఛన్ల సొమ్ము పెంపుపై టిడిపి ప్రభుత్వం తొలి అడుగువేసింది. వృద్ధులు, వికలాంగులు, వితంతవులు, ఇతర వర్గాలకు ప్రస్తుతం తీసుకుంటున్న రూ.3 వేలు పింఛనును రూ.4 వేలకు పెంచుతూ సిఎం చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం సంతకం చేయడంతో గుంటూరు, పల్నాడు జిల్లాలో పింఛను తీసుకుంటున్న 5,44,717 మందికి మేలు జరగనుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏప్రిల్ నుంచి ఈ పెంపు వర్తిస్తుంది. ఈ మేరకు జులై

▶ 2లో



ఆర్డీవో కార్యాలయ ఏవో కె.శివరామకృష్ణారావుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

విచారణ లేకుండానే అంగన్వాడీల తొలగింపు

- సత్వరమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు వినతి
- అంగన్వాడీల సమస్యలను ప్రస్తుత ప్రభుత్వమైనా పరిష్కరించాలని డిమాండ్

2 లో



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

రాజధాని అభివృద్ధిని వేగవంతం చేయాలి : సిపిఎం

- రైతులు, అసైన్డ్ రైతులకు పెండింగ్ కౌలును సత్వరం జమ చేయాలి
- పేదలకు ఇళ్లపట్టాలపై లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - తాడేపల్లి

రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, రైతులకు, అసైన్డ్ రైతులకు పెండింగ్ ఉన్న వార్షిక కౌలును వారి అకౌంట్లో వెంటనే జమ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఉండవల్లిలోని సిపిఎం కార్యాలయంలో ఈమని రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో

▶ 2లో


గంజాయిని మించిన లాటరీ!

పట్టణంలో గంజాయిని మించిన వ్యసనంగా నంబరింగ్ లాటరీ వేళ్లూనుకుంది. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల అండతో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు అడ్డగోలుగా ప్రజలను దోచుకున్నారు. కొత్త ప్రభుత్వంలో గంజాయిని కూకటివేళ్లతో సహా పెకలించి వేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్, గుంటూరు ఎంపి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పోలీస్ శాఖను అదేశించిన సంగతి తెలిసిందే. అయితే పట్టణంలో గంజాయితో సమానంగా సాగుతున్న నంబరింగ్ లాటరీపైనా పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వ్యసనపరులను నిలువునా దోచేస్తున్న నంబరింగ్ లాటరీ టెక్కెట్ల విక్రయాలపై వివరాల ప్రకారం...

- తెనాలి కేంద్రంగా భారీ కుంభకోణం
- నిర్వాహకుల మాయాజాలంతో కుదేలవుతున్న వ్యసనపరులు
- ఈ ప్రభుత్వమైనా అరికడుతుందా?

ప్రజాశక్తి-తెనాలి

గంజాయి విక్రయం, నంబరింగ్ లాటరీ టెక్కెట్ల విక్రయం రెండూ చాపకింద నీరులా పట్టణాన్ని పట్టిపీడిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన కాలంలోనే ఆరు కేసులు నమోదు చేసి, 29 మంది గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశామని, తాజాగా మరో కేసు నమోదు చేసి 8 మంది విక్రేతలను అరెస్టు చేసినట్లు ఇటీవలే పోలీసులు వెల్లడించడం



వహాబ్ చౌక్‌లో లాటరీ టిక్కెట్ల విక్రయించే బడ్డీకొట్లు

గంజాయి తీవ్రతకు నిదర్శనం. గతేడాది ఏప్రిల్ నెలలో ఐతానగర్‌లో ఒకే దఫా ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. ముఖ్యంగా విద్యార్థులు లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. ఇదే

▶ 2లో



ఇటీవల పోలీసులకు పట్టుబడిన గంజాయి ముఠా(ఫైల్‌ఫోటో)

గంజాయిని మించిన లాటరీ!

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని పోలీసులూ చెప్పారు. గంజాయి విక్రయంలో ఇవి మచ్చుకు మాత్రమే.

తెనాలి కేంద్రంగా నంబర్‌ లాటరీ

తెనాలి కేంద్రంగా కొనసాగుతున్న నంబర్ల లాటరీ ఓ పెద్ద కుంభకోణం. ఈ కుంభకోణానికి ప్రతిరోజూ దాదాపు 500-600 మంది వ్యసనపరులు బలైపోతున్నారు. సిక్కిం సూపర్‌, సిక్కిం డేటా, అరుణాచల లక్ష్మి, వైష్ణవి పేరుతో ప్రతిరోజూ నంబరింగ్‌ లాటరీ ఉంటుంది. వైసిపికి చెందిన కౌన్సిలర్‌ కనుసన్నల్లో సాగుతున్నట్లు ఆరోపణలున్న లాటరీ వ్యాపారం తెనాలి నుంచి రాష్ట్ర నలుమూలలకూ విస్తరించింది. పట్టణంలోనే నాలుగైదు ముఖ్య కూడళ్లలో టిక్కెట్లు విక్రయాలు సాగుతున్నాయి. వహాబ్‌ చౌక్‌, పెరుగు మార్కెట్‌, తదితర ప్రాంతాల్లో టిక్కెట్ల విక్రయం జరుగుతోంది. దీనికి దాదాపు 10 మంది టిక్కెట్ల విక్రేతలు కూడా ఉన్నట్లు సమాచారం. ఒకొక్కరు రోజురు కనీసం రూ.50 వేల నుంచి రూ.80 వేల ఖరీదైన టిక్కెట్లు విక్రయిస్తుంటారు.



పెరుగు మార్కెట్‌లో లాటరీ టికెట్లు విక్రయించే ప్రాంతం

ఆన్‌లైన్‌ పేరిట ప్రారంభమయ్యే టిక్కెట్ల విక్రయం రాష్ట్రవ్యాప్తంగా ఉదయం ఏడు గంటలకే ప్రారంభమవుతుంది. రోజుకు నాలుగు విడతలుగా లాటరీ ఉంటుంది. మధ్యాహ్నం 12.30కు, 1.30కు, సాయంత్రం 6 గంటలకు, రాత్రి ఎనిమిది గంటలకు జరిగే లాటరీకి టిక్కెట్ల విక్రయం ఉంటుంది. రాత్రి ఎనిమిది గంటలకు సంబంధించిన లాటరీ టిక్కెట్‌ ధర రూ.50 కాగా, మిగిలిన మూడు విడతలకు సంబందించిన టిక్కెట్‌ ధర రూ.70గా ఉంటుంది. వీటన్నింటి ఫలితాలు రాత్రి 8 గంటల తరువాత ప్రకటిస్తారు. ఆరు నంబర్లు కలిగిన లాటరీ టిక్కెట్‌లో ఫలితాల విడుదల సమయంలో నంబర్లు కలిసే విధానాన్ని బట్టి బహుమతులుంటాయి. ఉదాహరణకు ఆరు నంబర్ల లాటరీలో ఆరు నంబర్లు కలిస్తే ఒకరేటు, ఐదు నంబర్లు, నాలుగు నంబర్లు, మూడు నంబర్లు, రెండు నంబర్లు ఇలా నంబర్లు మ్యాచింగ్‌ తగ్గే కొద్దీ ప్రతిఫలం తగ్గుతుంది. నంబర్ల మ్యాచింగ్‌ను బట్టి టిక్కెట్‌ ధరకు మూడంతలు, నాలుగంతలు చెల్లిస్తామని విక్రేతలు నమ్మబలుకుతారు. అడపాదడపా చివరి ఒకరిద్దరికి చివరి రెండు నంబర్ల మ్యాచింగ్‌ మినహా ఫలితం ఉండదని, పెద్దమొత్తంలో చెల్లించాల్సిన ప్రైజ్‌మనీకి సంబంధించి మాత్రం విక్రయించకుండా మిగిలిపోయిన టిక్కెట్‌ నంబర్లలో చూపిస్తారని బాధితులు వాపోతున్నారు.

శ్రీకాకుళం జిల్లాల్లో ఈ లాటరీలో రూ.కోటికి పైగా బహుమతి పొందినా ఆ మొత్తాన్ని చెల్లించకుండా కొనుగోలుదారును మోసగించినట్లు కూడా ఆరోపణలున్నాయి. బూటకపు లాటరీ మాయాజాలం పోలీసులు దృష్టిలోఉన్నా పట్టించుకోవటంలేదని, నిర్వహణకు సంబంధించి గతంలో పోలీసుల సహకారం కూడా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. పట్టణంలో 2019లోనే లాటరీ దందా వెలుగు చూసింది. అప్పట్లో కేసు కూడా నమోదు చేసి, లాటరీ దందా మోసపూరితమని పోలీసులు ప్రకటించారు. అయితే దీనిని నియంత్రించటంలో మాత్రం మిన్నకుంటున్నారు. మొత్తం మీద లాటరీ వ్యాపారం మాత్రం పేకాట, గంజాయి వంటి వ్యసనాలను మించి పోయిందని ప్రజలంటున్నారు. పేదల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్న గంజాయి, పేకాట వంటి వ్యసనాలను మించిన నంబరింగ్‌ లాటరీ టిక్కెట్ల విక్రయాన్ని అరికట్టడంలో కొత్త ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ లేకుండానే అంగన్వాడీల తొలగింపు

- **సత్వరమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు వినతి**
- **సమస్యలను ప్రస్తుత ప్రభుత్వమైనా పరిష్కరించాలని డిమాండ్‌**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన నెపంతో విధుల నుంచి తొలగించిన అంగన్వాడీలను తిరిగి విధుల్లోకి తక్షణమే తీసుకోవాలని సిఐటియు పల్నాడు జిల్లా కమిటీ డిమాండ్‌ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ శ్రీకేశ్‌ బి లత్కర్‌ను గురువారం కలిసి విన్నవించారు. అయితే తొలగింపు సమయంలో తాను ఇక్కడ కలెక్టర్‌గా విధుల్లో లేని దృష్ట్యా నరసరావుపేట ఎన్నికల రిటర్నింగ్‌ అధికారులకు విన్నవించాలని కలెక్టర్‌ సూచించారు. దీంతో వారు ఆర్‌డిఒ ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ కె.శివరామకృష్ణ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌.ఆంజనేయులు నాయక్‌ మాట్లాడుతూ ఎన్నికలప్పుడు నిబంధనలు ఉల్లంఘించారనే నెపంతో జిల్లాలో అంగన్వాడీలను తొలగించడంలో అధికారుల సూచన మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అసలు వాస్తవాలు భిన్నంగా ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలు అంగన్వాడీ ఉద్యోగుల ఇళ్లకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్న సందర్భంగా తీసిన ఫొటోలను ఉపయోగించి రాజకీయ కక్షతో కొంతమంది అంగన్వాడీ ఉద్యోగులపై తప్పుడు ఫిర్యాదులు చేశారని, వాటి ఆధారంగా అంగన్వాడీలను తొలగించారని చెప్పారు.

ఏపీ అంగన్వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షులు జి.మల్లీశ్వరి మాట్లాడుతూ గౌరవవేతనం అతితక్కువే అయినా అంకిత భావంతో విశేష సేవలందిస్తున్న అంగన్వాడీలను గౌరవించాల్సిన ప్రభుత్వం విచారణేమీ లేకుండానే విధుల నుండి తొలగించడం అన్యాయమన్నారు. నూతన ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని, బాధిత అంగన్వాడీలను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అంగన్వాడీలను గత ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా సమస్యలను పరిష్కరించాలని కోరారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకుంటే యూనియన్‌ ఆధ్వర్యంలో పోరాటాలు తప్పవన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ప్రాజెక్టు కార్యదర్శి నిర్మల, సాయి పాల్గొన్నారు.

రెంటపాళ్ళలో ఘర్షణ : ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్‌

ద్విచక్ర వాహనం తగిలిన విషయం లో జరిగిన చిన్నపాటి వివాదం కొట్లాటకు దారితీసింది. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన బండారు రామకోటేశ్వరరావు ద్విచక్ర వాహనం పై సెంటర్‌ కు వస్తున్నాడు. అదే కాలనీకి చెం దిన కారుమంచి రాజేష్‌ పల్లె సందీప్‌ లు ద్విచక్ర వాహనం పై. రామకోటేశ్వరావు. వెనుక వస్తున్న నేపథ్యంలో రామకోటేశ్వరావు బైక్‌ యువకుల బైక్‌ కు తగలటంతో వివాదం చోటు చేసు కుంది. కారుమంచి రాజేష్‌, పల్లె సందీప్‌ లు మద్యం సేవించి రామకోటేశ్వరావు ఇంటికి వెళ్ళి గొడవపడ్డారు. ఈ క్రమంలో ఒకరిపై మరొకరు దాడికి పాల్పడ్డారు. సందీప్‌, కారుమంచి రాకేష్‌, బండారు రవి తీవ్రంగా గాయపడ్డారు. రవి భార్య ఏంజెల్‌ కుమార్తె రిత్విక స్వల్ప గాయాలయ్యాయి. సందీప్‌ కు చెందిన ద్విచక్ర వాహ నాన్ని తగల పెట్టారు. గాయపడిన వారు సత్తెన పల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొం దుతున్నారు. ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేష్‌,సందీప్‌ ఫిర్యాదు మేరకు బండారు రామకోటేశ్వరరావు, రవి, ఏంజెల్‌ పై కేసు నమోదు చేశారు. బండారు రవి ఫిర్యాదు మేరకు కారుమంచి రాజేష్‌ పల్లె సందీప్‌ లపై కేసు నమోదు చేశారు . సత్తెనపల్లి రూరల్‌ పోలీసులు ఇరువర్గాల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసరావుపేట లోనే మకాం వేసిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ రోజున మాచర్ల నియోజకవర్గంలో పాల్వాయి గేటు వద్ద పోలింగ్‌ కేంద్రంలో ఈవిఎం పగులగొట్టిన ఘటన నేపథ్యంలో పిన్నెల్లి రామకష్ణ రెడ్డిని అరెస్ట్‌ చేయాలని ఎన్నికల కమిషన్‌ ఆదేశాల నేపథ్యంలో కొన్ని రోజుల పాటు పరారీలో ఉన్న ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్‌ కు దరఖాస్తు చేసుకున్నారు. మొదట 6 వ తేదీ వరకు అరెస్ట్‌ చేయొద్దన్న హై కోర్టు వరుసగా 3 వ సారి బెయిల్‌ పొడిగించిన నేపథ్యంలో తాజాగా ఈ నెల 20 వరకు బెయిల్‌ మంజూరు చేసింది. ఇదిలా ఉండగా ప్రతి రోజు ఎస్పీ కార్యాలయంలో సంతకం చేయాలన్న కోర్టు నిబంధన మేరకు మాజీ మంత్రి నరసరావుపేట వైసిపి పార్లమెంట్‌ అభ్యర్థిగా పోటీ చేసిన అనీల్‌ యాదవ్‌ బస చేసిన నివాసంలో ఉంటున్న రామకృష్ణా రెడ్డి గురువారం ఎస్పీ కార్యాలయంలో సంతకం చేసేందుకు పోలీసు బందోబస్తు నడుమ వచ్చారు.



పింఛను రూ.4 వేలకు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

పింఛను సొమ్ము రూ.4 వేలతోపాటు మూడునెలలకు రూ. 3వేలు కూడా కలిపి రూ.7 వేలు జులైలో అందిస్తామని ఇప్పటికే సిఎం చంద్రబాబు ప్రకటించారు. గుంటూరు జిల్లాలో 2,61,598 మంది పింఛనుదారులు ఉండగా వీరికి ప్రతినెలా రూ.81,47,76,500 ప్రభుత్వం అందిస్తోంది. పల్నాడు .జిల్లాలో 2,83,119 మంది లబ్ధిదారులకు రూ.84,58,51,500 అందిస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు 50 ఏళ్లు దాటిన వారికి కూడా పింఛన్లు అందిస్తామని ప్రకటించినా ఇంకా ఈ అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని అధికారులు తెలిపారు. దీనిపై తగిన కార్యాచరణ ప్రకటించాల్సి ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు ఉన్న పింఛన్లు యథాతథంగా కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రస్తుతం ఉన్న వాలంటీర్లు, సచివాలయం ఉద్యోగుల ద్వారానే ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రాజధాని అభివృద్ధిని వేగవంతం చేయాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానినరేంద్ర మోడీ రాజధాని అభివృద్ధికి నిధులు ఇస్తామని వాగ్దానం చేసి కూడా నిధులు ఇవ్వలేదని, ప్రస్తుతం టిడిపి, జనసేన మిత్రపక్షంగా ఉన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని రాజధాని అభివృద్ధికి నిధులు,రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కోసం పట్టుబట్టాలని కోరారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బిజెపి మతోన్మాద ఎజెండాను ప్రజలు తిరస్కరించి ఆ పార్టీ స్థానాలను తగ్గించారని, మోడి గ్రాఫ్‌ పడిపోయింది అనడానికి ఇది నిదర్శనమని చెప్పారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మోడి ప్రధాని అయ్యాక పెట్రోల్‌, డీజిల్‌, వంట గ్యాస్‌ ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేట్‌ సంస్థలకు, కార్పొరేట్‌ శక్తులకి అప్పగిస్తున్నారని విమర్శించారు. మోడి తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలను మానుకోవాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో 22 వేల కుటుంబాలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నాయని, తాము అధికారంలోకి వస్తే వీరందరికీ ఇళ్ల పట్టాలిస్తామని లోకేష్‌ హామీ ఇచ్చారని, తాడేపల్లిలో శిలాఫలకాన్నీ వేశారని గుర్తు చేశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన లోకేష్‌ తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. సిపిఎం రాజధాని డివిజన్‌ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న వారికి బ్యాంకు అధికారులు బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు ఇస్తుండడంతో లబ్ధిదార్లు ఆందోళన చెందుతున్నారని అన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు సిఆర్‌డిఎకు డిపాజిట్‌ రూపంలో చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈ సమస్య వచ్చిందని తెలిపారు. ఇళ్ల లబ్ధిదారులకు చెల్లించాల్సిన డబ్బులను వారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఎం.భాగ్యరాజు, వి.వెంకటేశ్వరరావు, సిహెచ్‌ సుందర్రావు, ఎస్‌.కె.ఎర్రపీరు, జి.కృష్ణ, జి.నాగేశ్వరరావు, షేక్‌ గని, ఎం.ప్రసన్నకుమార్‌ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 1080 ఖాళీలు?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల షెడ్యూలు విడుదల కావ డంతో ఈ ప్రక్రియ నిలిచి పోయింది. ఐదేళ్లపాటు ఒక్క నోటి ఫికేషన్‌ కూడా విడుదల చేయకుండా కాలయాపన చేసిన వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు కంటితుడుపుగా నోటిఫికేషన్‌ ఇచ్చిందనే విమర్శలు వచ్చాయి. ప్రతి ఏటా జనవరిలో జాబ్‌ కేలండర్‌ విడు దల చేస్తామని ప్రక టించిన మాజీ సిఎం జగన్‌ ఒక్కసారి కూడా నోటి ఫికేషన్‌ విడుదల చేయ లేదని నిరు ద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచా రంలో టిడిపి అధినేత చంద్ర బాబు తాము అధికారంలోకి వస్తే మెగా డిఎస్‌సి నోటికేషన్‌ ఇస్తామని ప్రక టించారు. ఈ ఫైల్‌పై తొలి సంతకం చేస్తానని ప్రకటించారు. ఈ మేరకు గురువారం తొలి సంతకం చేశారు. దీంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమైంది. నిర్ణీత షెడ్యూలు ప్రకారం త్వరగా పోస్టులు భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని నిరుద్యోగులు నూతన ప్రభు త్వాన్ని కోరుతున్నారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పున రుద్ధరణకు కూడా ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు సిఎం చంద్రబాబు గురువారం తన తొలి ఐదుసంతకాల్లో ఈ ఫైలుపైనా సంతకం చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు 20 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు అవకాశం ఏర్పడింది. అన్న క్యాంటిన్లలో రూ.5కే అల్పాహారం, భోజనం అందించడం వల్ల పేదలకు ఎంతో ఉపయోగపడింది. అన్న క్యాం టీన్లను 2019 జూన్‌లో అప్పటి వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది.

ఎమ్మెల్యే ఇంటి వద్ద అధికారుల నిరీక్షణ

- పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు
- చోటా నాయకులకు పెరిగిన గిరాకీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

అధికారం ఎక్కడ ఉంటే అక్కడ అధికారులు వాలిపోతారు. ఒకప్పుడు ఏ ప్రభుత్వం వచ్చినా తమ విధులు తాము నిర్వహించుకుంటూ వెళ్లే అధికారులు ఇటీవల కాలంలో అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు . అధికారులు ప్రతిపక్ష పార్టీల నేతల దృష్టిలో వ్యతిరేకులుగా మారుతున్నాయి. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో రెవెన్యూ, పోలీస్ , రిజిస్ట్రేషన్ తో పాటు ఆర్థిక వసతులు సమకూర్చే శాఖలపై ఎమ్మెల్యేలు వారి ప్రధాన అనుచరులు దృష్టి ఉంటుంది. కొందరు అధికారులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి దాసోహం అవుతున్నారు. ఇటీవల వచ్చిన ఫలితాలతో టిడిపి అఖండ విజయం సాధించిన విషయం తెలిసిందే. పోలీసులు ఇతర శాఖల అధికారులు ఎమ్మెల్యేలు, టిడిపి నేతల ఇళ్ళ ముందు పడిగాపులు కాస్తున్నారు. 'అయ్యా .. అయ్యా' అంటూ తిరుగుతున్నారు. బదిలీలు రాను ఉండటంతో తమకు సహ కరించాలంటూ ప్రాదేయ పడుతున్నారు.

అధికార టిడిపి నేతల ఇళ్ల వద్ద ఆ పార్టీ నేతలు కార్యకర్తలతో పాటు అధికారులు పడి గాపులు కాస్తున్నారు. ఒకప్పుడు పోలీస్, రెవిన్యూ తో పాటు ఇతర అధికారులు నిజాయితీగా విధులు నిర్వహించేవారు. చట్టప్రకారం తమ విధులు పూర్తి చేసేవారు. ఇటీవల కాలంలో అటు వైసిపి ఇటు టిడిపి పాలనలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ విధానాలు అమలు చేయడంతో పాటు మంత్రులు ఎమ్మెల్యేలు నేతలు చెప్పినట్లు వినటం ఆనవాయితీగా వస్తుంది. అదే సమయంలో నాయకుల అడుగులకు మడుగులెత్తేనే మంచి పోస్టింగులు ఉంటాయని భావన ఏర్పడింది. దీంతోపాటు ఆర్థికంగా బలపటానికి అవకాశాలు ఉన్న చోట అధికారులు వాలిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో పోలీసులు ఇష్టాను సారం వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. రెవిన్యూ అధికారులు పెద్ద ఎత్తున అప్పటి అధికార పార్టీ నేతలు చెప్పినట్టు చేశారని పేరు ఉంది. ఇసుక ,గ్రావెల్ ,రియల్ ఎస్టేట్ దందా, అక్రమ లేఔట్ లు, ఇరిగేషన్ కాలువలు ఆక్ర మించుకున్న అధికారులు పట్టించుకోలేదని విమర్శలున్నాయి. ఇలా అనేక విష యాల్లో కొందరు అధికారులు ఇష్టాను సారంగా వ్యవహరించాలని టిడిపి నేతలు అప్పటిలో ఆరోపణలు చేశారు. ఇదే సమ యంలో ఎక్కడెక్కడ అధికారులు వైసీపీ నేతలకు సహకరించారో టిడిపి నేతలు జాబితా సిద్ధం చేసుకున్నారు. నియోజక వర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. వీటిలో అమరావతి, అచ్చంపేట, బెల్లం కొండ మండలాల్లో ఇసుక ర్యాంపులు ఉన్నాయి. రాష్ట్రంలోనే ఈ ప్రాంత ఇసుకకు ప్రత్యేక డిమాండ్ ఉంది.

అత్యధిక ఇసుక రీచ్ లు ఉన్న ప్రాంతం కూడా ఇదే. బెల్లం కొండ ,అచ్చంపేట, క్రోసూరు మండలాల్లో ప్రభుత్వ పోరంబోకు, కొండ పోరంబోకు భూములు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పోస్టింగుల కోసం అధికారులు తమకు తెలిసిన చోటా మోటా నాయకుల ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అర్జునరావు మాస్టారుకు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి



తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో పిఇటి మాస్టారుగా పని చేసి ఇటీవల గుండెపోటుతో మరణించిన అర్జునరావుకు గురువారం స్థానిక హైస్కూల్లో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడుతూ అర్జునరావు మాస్టారు లేని లోటు తీర్చలేనిదని చెప్పారు. విద్యార్థినీ, విద్యార్థులను మానసిక పరిపుష్టి కోసం వివిధర రకాల ఆటలు ఆడించటంలో ఆయన చేసిన కృషి మరువలేదని చెప్పారు. క్రమశిక్షణ, అకింతభావం తాను అలవర్చుకోవడమే కాకుండా పిల్లలకు కూడా అలవడే విధంగా పని చేశారని తెలిపారు. బాలోత్సవాల సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో జరిగే వివిధ రకాల పోటీలకు తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి విద్యార్థులను పంపడంలో ఆయన కీలకపాత్ర వహించారని చెప్పారు. ఇటీవల డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో కోలాటం నేర్పించేందుకు విద్యార్థులను సమీకరించేందుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కె అన్వర్, ప్రసాద్, కోటేశ్వరరావు, స్వరూపరాణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-నాదెండ్ల

రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట జనుము జీలుగా పిల్లి పెసర విత్తనాలు పంపిణీ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల రైతులకు దుక్కిలో వేసే పచ్చిరొట్ట జిలుగా విత్తనాలను 50 శాతం సబ్సిడీపై ఇవ్వబడునని వ్యవ సాయ శాఖ అధికారి హరి ప్రసాద్ తెలిపారు. ఈ విత్తనాలను అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. జీలుగా 10 కిలోల సంచి, 440 ,జనుము 10 కిలోల సంచి 440, పిల్లి పెసర 8 కిలోల సంచి 536 ఈ విత్త నాలు కావలసిన రైతు లు ఆయా గ్రామాల సచి వాలయాల్లో ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ తీసు కుని వెళ్లాల్సిందిగా ఏవో హరి ప్రసాద్ తెలిపారు ఈ విత్తనాల పంపిణీ బయో మెట్రిక్ ద్వారా అందజేయనున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో పచారీ షాపు నిర్వాహకుడు దుర్మరణం

ప్రజాశక్తి -పొన్నూరు

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొన్న సంఘటనలో పచారి షాపు నిర్వాహకుడు ఆలపాటి ఆది నారాయణ(72) దుర్మరణం పాలయ్యాడు. పట్టణ పోలీ సుల కథనం ప్రకారం గుంటూరు వైపు నుండి బాపట్ల వైపు సుద్ద లోడ్‌తో లారీ వెళుతోంది. అదే సమయంలో పొన్నూరు పట్టణంలోని పచారి షాపు నిర్వాహకుడు ఆది నారాయణ టిఫిన్ చేసి గాంధీ బొమ్మ సెంటర్ వైపు వెళుతుండగా ఆయనను లారీ ఢీ కొట్టడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. స్థాని కులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్సై రాజ కుమార్ సంఘటన స్థలాన్ని సంద ర్శించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు లారీ డ్రైవర్ను అదుపు లోకి తీసు కున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పట్టణ ఎస్ఐ రాజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో ఆలపాటి ఆదినారాయణ మృతదేహం,ఆదినారాయణ (ఫైల్ ఫోటో)



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 39,445
మిర్చి ఎగుమతి	: 39,659
మిర్చి నిల్వ	: 12,394

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 18,000
నెం.5	10,000 - 16,500
273	14,000 - 15,000
341	8,000 - 17,000
నాన్ ఎసి	
తేజ	8,000 - 19,700
బడిగి	8,000 - 17,700
దేవనూరు డీలక్స్	8,000 - 15,500
తాలుకాయలు	5,000 - 11,000
ఎసి	
334	8,000 - 14,500
నెం.5	16,800 - 16,800
341	9,000 - 16,500
4884	8,800 - 16,000
తేజ	9,000 - 19,500
బడిగి	8,000 - 17,500
దేవనూరు డీలక్స్	16,000 - 16,000
తాలుకాయలు	5,000 -13,000

వైసిపి వర్గీయులపై దాడులు ఆపండి

- ముఖ్యమంత్రికి అనిల్ కుమార్ యాదవ్ విజ్ఞప్తి
- నెల్లూరు పారిపోయాననే వ్యాఖ్యలు తగదు
- ప్రతిపక్షంలో ఉండడం కొత్తేమికాదు
- ఓడినా గెలిచినా జగన్ వెంటే



జగన్‌ని కలిసిన అనిల్‌కుమార్‌యాదవ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పార్లమెంట్ స్థానం పోటీ చేసి ఓటమి పాలైన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ గురువారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసినట్లు నరసరావుపేట వైసిపి పార్లమెంట్ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. తనకు ఓటు వేసిన 6 లక్షల మంది ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి వైసిపి వర్గీయులపై టిడిపి వర్గీయులు చేస్తున్న దాడులను అరికట్టాలని కోరారు.నూతన ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. నెల్లూరు పారిపోయానని కామెంట్లు చేస్తున్నారని, ఎక్కడికి పారిపోమని ప్రతిపక్షంలో ఉండడం కొత్త కాదని, లోపాలు సరిదిద్దుకుని ముందుకు వెళ్తామన్నారు. మంత్రుల నోటి దురుసు వల్ల ఓడిపోయారని ఆరోపణలు వస్తున్నాయని, సరిదిద్దుకుంటామని, ఓడినా గెలిచినా జగన్మోహన్ రెడ్డి వెంటే ఉంటామన్నారు.

రాజకీయాల నుండి తప్పుకునే వాడినే...

నరసరావుపేటలో ఓడిపోతే రాజకీయాలు నుండి తప్పుకుంటానని తాను చేసిన సవాలు నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్ స్వీకరించి ఉంటే తాను రాజకీయాలు నుండి తప్పుకునే వాడినని అన్నారు. ఆ సవాల్‌ను వారు స్వీకరించలేదు కనుకనే రాజకీయాలు నుండి తప్పుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సవాలు చేసిన వీడియోలు ట్రోల్ చేయడం వల్ల ఎవరికీ ఉపయోగం లేదన్నారు.

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లాజడ్జి కోర్టు, గుంటూరు.
CMA No. 3/2024

Between
కె.లక్ష్మినారాయణ .... అప్పిలెంట్
మరియు
డి.మీనా అండ్ అనదర్ .... రెస్పాండెంట్లు

టు
ఆర్2 : బొందిలి సాయి చంద్రశేఖర్ @ చంద్రశేఖర్ సింగ్, తండ్రి : సత్యనారాయణ సింగ్, 6/4, నెహ్రూనగర్, గుంటూరు.

పై అప్పిలెంట్ దాఖలు చేసిన పై నెంబరు సి.ఎం.ఎ.లో మరియు ఐ.ఎ. నెం. 80/2024లో మీకు నోటీసులు నిమిత్తం ఎన్ని పర్యాయములు పంపిననూ మీరు తీసుకోకపోవటంచే శ్రీ కోర్టువారు మీకు పేపరు ప్రకటన ద్వారా ది. 19-6-2024న వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా తేదీన మీకు ఉదయం 10-30 గం.లకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా : 19-6-2024
గుంటూరు.
ది.12-6-2024

ఇట్లు
దొడ్డా శ్రీనివాసరావు,
శ్రీమతి వల్లంశెట్టి సుజని,
న్యాయవాదులు, గుంటూరు.
సెల్ : **98491 20408**

NOTICE

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE::GUNTUR
A.S No. 108 / 2020

Between :
Valluru Andalamma (Died) & Another ...Petitioners
and
Siramsetty Venkayamma@Valluru Venkayamma & Others. ...Respondents

To,
R-1: Siramsetty Venkayamma @ Valluru Venka Yamma, W/o.China Narasaiah.
R-2: Podili Siva Kumari, W/o.S.Varamakrishna.
R-4: Siramsetty Jaya Prakash, S/o. Venkateswarlu
R-5: Siramsetty Siva Naga Ajaya Babu, All are R/o. 8th lane, Gunturvari Thota, Guntur.
R-6: Chirumamilla Kanaka Rajeswari, W/o. Ravindra Babu,R/o.Chandramouli Nagar, Guntur.
R-7: Guntupalli Lakshmi Neelima, W/o.Durga Prasad, R/o.Ponnekallu Village, Tadikonda(Md), Guntur Dt.
R-8: Siramsetty Padma, W/o. Late Venkateswarlu, R/o. Door No.13-8-177, 8th lane, Gunturvari Thota, Guntur.

పైనెంబరు అప్పీలు దావాలో రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసులును ఈపేపరు ప్రకటనద్వారా తెలియజేయమని **ది.21-06-2024**కి వాయిదావేసినారు.కావున వాయిదారోజు **ఉ॥గం॥ 10-30ని॥**లకు పై కోర్టులో హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కొల్లి శంకరరావు
అప్పిలెంట్ తరపు న్యాయవాది,రాజేంద్రనగర్, గుంటూరు. సెల్ : 9951279063

మహారాజశ్రీ విజయవాడ 8వ అదనపు జిల్లా జడ్జ్ వారి కోర్టులో
O.S.NO.69 /2022

Between
కిలారు రామమోహనరావు .... వాది
మరియు
1. నాదేళ్ల అంకయ్య
2. కోవి ఇందిర .... ప్రతివాదులు

TO
కోవి ఇందిర, D/o. రామమూర్తి, డోర్ నెం. 4-4-130/1D, JNR రోడ్డు, చంద్రమౌళి నగర్, గుంటూరు.

పై నెంబరు దావా మరియు I. A.No.147/2022 లో 2వ ప్రతివాది అయిన మీకు నోటీసు మరియు దావా సమన్లు నిమిత్తం ది.19-06-2024 వ తేదీన వాయిదా వుండి వున్నది. కనుక ఆ రోజున ఉదయం గం.10-30 ని॥ లకు మీరు స్వయంగా గాని లేక మీ ప్లీడర్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపనలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్ష మందు విచారించి తీర్మానించబడునని ఇందుములము గా తెలిజేయదమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

డి.పి. రామకృష్ణ
వాది తరపు న్యాయవాది
విజయవాడ-10
Cell: 98490 82858

దావా సమను

ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS NO : 23/2016

పేర్ల మోహనరావు వగైరా ....వాదులు
వర్సెస్
బిజపురి శాంత వగైరా .... ప్రతివాదులు

To
D33) చుక్కా బసవేశ్వర రావు, తండ్రి: సాంబశివరావు, డోర్ నెంబర్ 7-46, కృష్ణవేణి నగర్, నరసరావుపేట, గుంటూరు జిల్లా.

వాదులు మీ వగైరాలపై దావా షెడ్యూలు ఆస్తిని గురించి పర్మినెంట్ ఇంజక్షన్ పరిహారముల కొరకు దావా చేయగా మీ నోటీసు నిమిత్తం తేది 25-06-2024 కి వాయిదా వేసి యున్నారు వాయిదా రోజున ఉదయం 10:30 కి పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

వాయిదా తేది : 25-06-2024
ఒంగోలు ఇట్లు
తేది 13-06-2024

M. అజయ్‌బాబు
G.రామమూర్తి
వై.మౌనిక
వాదుల తరపు అడ్వకేట్స్
రాజా పానగల్ రోడ్డు, ఒంగోలు

సిద్ధమవ్వని పాఠశాలలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్కూల్ రెడీన్స్ ప్రోగ్రామ్ క్రింద ఒక రోజు ముందుగానే ప్రతి పాఠశాలనూ శుభ్రం చేసి బుధవారం నాటికే సిద్ధం చేయాల్సి ఉన్నా పట్టణంలోని గిరిజన సంక్షేమ పాఠశాలతో పాటు మరికొన్ని పాఠశాలల్లే సంసిద్ధత అరకొరగానే కనిపించింది. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, డోర్లు, కిటికీలు సరిగా లేవు. గిరిజన పాఠశాలలో తరగతులు, బాలురు నిద్రించే గదులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దుమ్ము, దూళి పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికే ఇవ్వండి

మున్సిపల్ కమిషనర్ డి.వెంకటదాసు

ప్రజాశక్తి - మాచర్ల



ప్రజలు తమ ఇళ్లల్లోని వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలని కమిషనర్ డి.వెంకటదాసు సూచించారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి వ్యర్థాలను ఇవ్వకుండా రహదారులపై వేయటం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. రహదారులపై వేసిన వ్యర్థాలను తొలగించేలోపు సదరు వ్యర్థాలు రాకపోకలు సాగించే వాహనదారులకు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయన్నారు. కుళ్లిపోయే వ్యర్థాలను ఒక డబ్బాలో, కుళ్లని వ్యర్థాలను మరో డబ్బాలో వేసి తమ సిబ్బందికి ఇస్తే వారు వాటిని విడివిడిగా కంపోస్టు యార్డుకు తరలిస్తారని తెలిపారు. ఇళ్ల ముందర ఉండే మురుగు కాల్వల్లోనూ వ్యర్థాలను వేయవద్దని సూచించారు. ప్రజల సహకరిస్తేనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న చుక్క చంద్రపాల్

ఎన్‌డిఎకు ఎక్కువ చోట్ల ఓటమి : కాంగ్రెస్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

దేశ ప్రజలు ఎక్కువ చోట్ల ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను ఓడించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా మద్దతు పలికారని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త చుక్కా చంద్రపాల్ అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజ్‌పాల్ ఆధ్యక్షతన గురువారం సమావేశమయ్యారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సత్తెనపల్లి నియోజకవర్గం నుండి చుక్కా చంద్రపాల్ పోటీ, తదనంతర పరిణామాలపై సమీక్షించారు. చంద్రపాల్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి దానితో పొత్తుపెట్టుకున్న పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో ఎక్కువ మందిని ఇండియా వేదిక అభ్యర్థులు ఓడించారని చెప్పారు. నరేంద్ర మోడీ నియంతృత్వ పాలనకు ప్రజలు అడ్డుకట్ట వేశారని అన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరి కాకుండా రాష్ట్రంతోపాటు రాజధాని అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని కోరారు. నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో పిసిసి కార్యదర్శి ఎం.వేదాద్రి, నాయకులు చాంద్‌బాషా, అజీమ్, కె.ఆనంద్, షేక్ ఆరిఫ్, ఎం.శంకర్, కె.లక్ష్మయ్య, జె.శేఖర్, ఎం.శంకర్, అమీర్ పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం.. నలుగురికి ప్రాణం..



- స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి పల్నాడు బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల ఉచిత ప్రమాద బీమా
- నేడు రక్తదాన దినోత్సవం సందర్భంగా పల్నాడు బ్లడ్‌సెంటర్‌లో శిబిరం ఏర్పాటు



రక్త దానం చేస్తున్న షేక్ అబ్దుల్ గని



18 సార్లు రక్త దానం చేసిన ప్రకాష్‌ను సత్కరిస్తున్న బ్లడ్ సెంటర్ నిర్వాహకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాంకేతిక పరిజ్ఞానం ఎన్ని కొత్త పుంతలు తొక్కినా మనిషి స్వతహాగా తయారు చేయలేని పదార్థాలలో రక్తం అతి ప్రధానమైనది. దేశ వ్యాప్తంగా ఏటా 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరం పడుతుండగా కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే అందుతోంది. దీంతో ప్రతిరోజూ దేశవ్యాప్తంగా దాదాపు 10 వేల మందికి పైగా రక్తం అందక చనిపోతున్నారని నివేదికలు చెబుతున్నాయి. రక్త దానంపై అవగాహనా కార్యక్రమాలు పెరిగినా దాతల నుంచి స్పందన మాత్రం రక్త అవసరాలను తీర్చడానికి అనుగుణంగా లేదు. రక్తదానం ప్రాముఖ్యత తెలియజేయడానికి 2004 నుండి దేశ వ్యాప్తంగా ప్రతి ఏడాది జూన్ 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. శరీరానికి ఇంధనంలాంటి రక్త దానం ప్రాణ దానంతో సమానం. నేటి ఆధునిక జీవన విధానంలో పౌష్టికాహార లోపం, వ్యాధి నిరోధక శక్తి మందగించడం, ప్రమాదాల్లో గాయపడి రక్తస్రావం ఏర్పడిన సమయంలో రక్తం కొరత ఏర్పడుతుంది. రోడ్డు ప్రమాదాలు, కేన్సర్ చికిత్సలు, తలసేమియా చికిత్స, ప్రసవం వంటి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం. రక్తదానం చేసేవాళ్లు ఉంటేనే అత్యవసర పరిస్థితుల్లో ఇంకొకరి ప్రాణం కాపాడుకోగలం.

రక్తదానం ఎవరు చేయొచ్చు?

ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 60 ఏళ్లలోపు రక్తదానం చేయడానికి అర్హులు. ఒక వ్యక్తి తన జీవితకాలంలో దాదాపు 168 సార్లు రక్తదానం చేయవచ్చు. చెడు అలవాట్లు ఉన్నవారు, హెపటైటిస్ బీ, సీ, హెచ్ఐవీ, రక్తపోటు అధికంగా ఉన్నవారు రక్తం దానం చేయడానికి అనర్హులు. ఒకసారి రక్తం ఇచ్చిన తర్వాత మహిళలైతే ఆరు నెలలు, పురుషులు మూడు నెలల తర్వాత మళ్లీ రక్తం ఇవ్వొచ్చు. ఒకసారి రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణందానం చేయవచ్చు.

ముణ్ణెల్లకోసారి రక్తదానం చేయొచ్చు

డాక్టర్ వెంకటేశ్వర్లు.బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్.

ఒక్క వ్యక్తి రక్తదానం నాలుగు ప్రాణాలను కాపాడుతుందని ప్రపంచ ఆరోగ్య నివేదికలు చెబుతున్నాయి. దాత నుండి సేకరించిన రక్తాన్ని వివిధ కాంపోనెంట్లుగా విభజిస్తారు. సేకరించే రక్తాన్ని హోరీల్ బ్లడ్ అంటారు. ఆ రక్తంలో ప్లాస్మా, ప్లేట్లెట్స్, తెల్ల రక్త కణాలు, ఎర్ర రక్త కణాలు ఉంటాయి. వీటిని విడదీసిన కారణంగా నలుగురికి ఈ రక్తాన్ని ఎక్కించవచ్చు. రక్తదాత నుంచి ప్లేట్లెట్లను, ప్లాస్మాను మాత్రమే తీయగల సాంకేతికత అభివృద్ధి అందుబాటులోకి వచ్చింది. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రతి 3 నెలలకు ఒకసారి సాధారణ రక్తదానం చేయడం సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్లేట్లెట్స్ గానీ ప్లాస్మాను గానీ దానం చేయవచ్చు. అనారోగ్యంతో ఉన్నవారు రక్తదానం చేయకూడదు. రక్త మార్పిడి ద్వారా ఒకరి నుంచి ఒకరికి సంక్రమించే దీర్ఘకాలిక వ్యాధులున్న వారు జీవితంలో ఎప్పటికీ రక్త దానం చేయకూడదు.

రక్త దాతలకు ఆ ఇద్దరు స్ఫూర్తి

కె.జానకి రామయ్య, పల్నాడు బ్లడ్ సెంటర్.నరసరావుపేట.

26 ఏళ్ల వయసులో ఇప్పటికీ 12 సార్లు రక్తదానం చేసిన అబ్దుల్ గని 30 ఏళ్ల వయసు కలిగిన ప్రకాష్ 18 సార్లు రక్తదానం చేసి రక్త దాతలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. రక్తదానం చేసి అంతటితో ఆగకుండా ఎంతోమందితో రక్తదానం చేయించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారికి రక్తం అందజేసి ప్రాణాలు కాపాడుతున్నారు. రక్తం అవసరమని సమాచారం అందజేస్తే వారు స్పందిస్తున్న తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం. ఆపదలో ఉన్నవారికి మేమున్నామని భరోసానిస్తూ అత్యవసర పరిస్థితుల్లో పరిచయం లేకపోయినా చాలా మందికి రక్తం ఇచ్చి ప్రాణదాతలుగా నిలిచారు. ప్రతి ఇంట్లో ఒక రక్తదాతను తయారు చేసేందుకు అబ్దుల్ గని, ప్రకాష్ కృషి చేస్తున్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి తమ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనా పల్నాడు బ్లడ్ సెంటర్ నందు సంప్రదించొచ్చు.

పల్నాడు జిల్లాపై రూ.85 లక్షల పత్తివిత్తన భారం

- గతేడాదికంటే పెరిగిన ధర - జిల్లాలో 3 లక్షలకుపైగా ఎకరాల్లో సాగు అంచనా
- విత్తన రాయితీలపై ప్రభుత్వ ప్రకటన కోసం రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఖరీఫ్ సాగు ప్రారంభమైన నేపథ్యంలో బిటి-2 పత్తి విత్తన ధర స్వల్పంగా పెరిగింది. 475 గ్రాముల ప్యాకెట్ ధర గతేడాది రూ.853 ఉండగా ఈ ఏడాది రూ.864 పెంచారు. ఈ లెక్కన జిల్లాలోని పత్తిసాగుదార్లపై రూ.85 లక్షల భారం పడనుంది. గత ప్రభుత్వం విత్తన రాయితీలు ఎత్తి వేయడంతో రైతులు విత్తనాల పరంగా అనేక ఇబ్బందులు పడ్డారు. కొత్త ప్రభుత్వమైనా విత్తన రాయితీలిస్తుందేమోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

పల్నాడు జిల్లాలో 3,06,250 ఎకరాల్లో పత్తి సాగవుతుందని, ఇందుకుగాను 765625 విత్తన సంచులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. జిల్లాలో వాణిజ్య పంటలైన మిర్చి, మొక్కజొన్న, పత్తి విస్తీర్ణం ఎక్కువే. కొన్నేళ్లుగా పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతితో ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో గతేడాది 1,63,252 ఎకరాల్లోనే సాగు చేశారు. రైతులు ఒక్కొక్క ఎకరాకు రెండున్నర ప్యాకెట్ల వరకు విత్తడానికి వాడుతుంటారు. ఈ ప్యాకెట్లో 450 గ్రాముల బిటి, మరో 25 గ్రాముల నాన్‌బిటి విత్తనాలు ఉంటాయి. నాన్ బిటి విత్తనాలను గట్లపై నాటాల్సి ఉండగా అవగాహన లేమితో రైతులు విత్తడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులకు విత్తన నిల్వలు ఏర్పాటు చేసేందుకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది.

వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆశించిన మేర ఉంటే వరి సాగు విస్తీర్ణం 1,93,750 ఎకరాల్లో ఉంటుందని, ఇందుకనుగుణంగా విత్తన నిల్వలు కావాల్సిన ఎరువులు సిద్ధం చేస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించారు. గతేడాది వర్షాలు ఆశాజనకంగా లేకపోవడం, వరి సాగులో పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో రైతులు నష్టాలపాలయ్యారు. అందుకే బావులు, బోర్లు, వాగులు, చెరువులు వంటి నీటి వనరులు ఉన్న రైతులు తిండి గింజల కోసమే వరి సాగు చేపట్టారు. సకాలంలో వర్షాలు కురిసి సాగు నీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత సమృద్ధిగా ఉండడంతో పాటు ఎరువులు విత్తనాల్లో రాయితీలు కల్పించి ధాన్యానికి మద్దతు ధర ప్రకటిస్తే గాని వరి సాగు విస్తీర్ణం పెరగడానికి అవకాశం లేదని రైతులు, రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. అపరాల పంటలైన మినుము, పెసర, కంది, ఇతర విత్తనాల ధరలపై నూతన ప్రభుత్వం విత్తన రాయితీలు ఇస్తుందని రైతులు భావిస్తున్నారు. ఆ ప్రకటన కోసం నిరీక్షిస్తున్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ

ప్రజాశక్తి-గుంటూరు

అతి తక్కువ వేతనాలతో గత ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఉద్యోగ భద్రత కరువైందని ఏపీ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి అన్నారు. గురువారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో నేతాజి మాట్లాడుతూ ప్రభుత్వాలు వీరి జీతాల చెల్లింపు గ్రామ పంచాయతీలకు అప్పజెప్పటంతో ఆ పంచాయతీలకు వచ్చే ఆదాయంతో వీరి జీతభత్యాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. చాలా పంచాయతీల్లో రూ.6వేల నుండి రూ. 8వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, అవి కూడా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఎక్కువ పంచాయతీల్లో పార్ట్‌టైమ్ టెండర్ కార్మికుల రెన్యువల్ ప్రతిపాదనలు గ్రామ పంచాయతీ నుండి పై అధికారులకు పంపట్లేదన్నారు. దీని వల్ల సంవత్సరం దాకా రెన్యువల్ ఆర్డర్స్ రాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందరూ ఒకే రకమైన పనిచేస్తున్నప్పటికీ జీతాలు తేడాలు ఉన్నాయని, టెండర్ విధానం రద్దు చేసి అందరికీ ఒకే రకమైన జీతంతో రెగ్యులర్ చేయాలన్నారు. అనేక పంచాయతీల్లో వారాంతపు సెలవులు, యూనిఫాం, సబ్బులు, గుర్తింపు కార్డులు ఇవ్వట్లేదని, పిఎఫ్, ఇఎస్ఐ ఊసే లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయితీ కార్మికులు అందరూ ఐక్యమై పోరాటం చేయటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ సమావేశానికి డి.వి.నరసింహారావు అధ్యక్షత వహించగా, కమిటీ సభ్యులు చింతల శ్రీనివాసరావు, పి.మేనకరావు, టి.సంధ్య, కె.సుబ్బారావు, జి.ఏడుకొండలు, ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై నేతాజి

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి - తెనాలి : రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా తెనాలి వచ్చిన నాదెండ్ల మనోహర్‌కు కూటమి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. నందివెలుగు వంతెన నుంచి భారీ ర్యాలీ నడుమ ఆయనను పట్టణంలోని జనసేన కార్యాలయానికి తీసుకువచ్చారు. ఆయన రాక సందర్భంగా పార్టీ నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున నందివెలుగు కూడలికి చేరుకుని అక్కడి నుంచి ర్యాలీ ప్రారంభించారు. విఎస్సార్ కళాశాల, ఐతనగర్ లింగారావు సెంటర్, రజకచెరువు మీదుగా పార్టీ కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. మార్గమధ్యంలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. అంగలకుదురుకు చెందిన గణేష్ యూత్ బృందం ఆయనను ప్రత్యేకంగా అభినందించింది. కార్యక్రమంలో జనసేన నాయకులు దివ్వెల మధుబాబు, బండారు రవికాంత్, షేక్ ఇస్మాయిల్, బెల్లపు యశ్వంత్, టిడిపి నాయకులు వీరవల్లి మురళి, సుద్దపల్లి నాగరాజు, కన్నెగంటి మురళీకష్ణ, కనగాల నాగభూషణం, నెలకుర్తి రమేష్, తదితరులు ఉన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మనోహర్



మెగా చెక్కును లబ్దిదారులకు అందచేస్తున్న బ్యాంకు అధికారులు

బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.58.75 కోట్ల రుణాలు మంజూరు

ప్రజాశక్తి-గుంటూరు

బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ ఆధ్వర్యంలో రుణవితరణ, వినియోగదారుల సమావేశం స్థానిక మిర్చి యార్డు వద్ద ఉన్న అట్లాంటిక్ హెూటల్‌లో నిర్వహించారు. ఈ సమావేశాన్ని డిప్యూటీ జనరల్ మేనేజర్ మనోహర్ రామ్‌దాస్ మానే ప్రారంభించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులకు అందుబాటులో ఉంటు ందని, ఒక బ్యాంక్ అనేక రుణాలు అనే నినాదంతో ముందు కు వచ్చిందని పేర్కొన్నారు. విజయవాడ జోనల్ మేనేజర్ యంవివి బంగార్రాజు మాట్లాడుతూ గుంటూరు, విజయ వాడ పరిసర ప్రజలు, వినియోగదారుల సహ కారంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైల్, ఎంఎస్ఎంఇ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వటంలో ఎల్ల వేళలా ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రూ.58.75 కోట్ల రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో రిటైల్, డ్వాక్రా, ఎంఎస్ఎంఇ లబ్దిదారులు పాల్గొన్నారు.



బ్యాంక్ వితరణ చేసిన కూలర్స్

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ వాటర్‌కూలర్స్ వితరణ

ప్రజాశక్తి - తెనాలి

భక్తుల సౌకర్యార్థం పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి ఆలయానికి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ పెదకాకాని శాఖ ఆధ్వర్యంలో మూడు వాటర్ కూలర్స్ గురువారం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ డి శ్రీరామ వరప్రసాదరావు వెల్లడించారు. బ్యాంకు ఉన్నతాధికారులు అందించిన రూ.57వేల విలువ గల వాటర్ కూలర్స్ ను ఆలయ ప్రాంగణములో అర్చకస్వాములచే ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరము వాటిని భక్తులకు అందు బాటులో ఉంచినట్లు తెలిపారు. బ్యాంకు అధికారులకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి, ఎ.జి.యమ్. పి.వీరారెడ్డి, పెదకాకాని శాఖ మేనేజరు బి.సువర్ణరాజు, కార్యాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్‌లో గురువారం దుర్గామల్లేశ్వరి రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని అధినేత కళ్లం సంజీవరెడ్డి ప్రారంభించారు. అమరావతిని రాజధానిగా ప్రకటించ డంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటుందని ఈ ప్రాంతంలో రియలస్టర్లు భావిస్తున్నారు. అందులో భాగంగానే దుర్గామల్లేశ్వరి రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ రంగంలో సంజీవరెడ్డికి గతంలో అపార అనుభవం ఉంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో బాగా రాణించాలని ఆకాంక్షించారు.

పదిలో సత్తా చాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘ పాఠశాలల్లో పదోతరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. స్థానిక మారీసుపేట ఎన్‌సిఆర్‌ఎం హైస్కూల్ ఆవరణలో గురువారం ఆర్‌కె మెమోరియల్ ఫండ్ ఆధ్వర్యంలో యంద్రపాలి చింపయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సిఆర్‌ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బషీర్ అహ్మద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణంలో ఉన్న ఆరు మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి పదిలో ప్రథమస్థానం పొందిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి రూ.1,116చొప్పున నగదు అందించారు. నగదు ప్రోత్సాహకాలు అందుకున్న వారిలో ఎనసిఆర్‌ఎం హైస్కూల్ నుంచి కొండిశెట్టి రిషిత(514), కెఎస్‌ఎం హైస్కూల్ నుంచి షేక్ సానియాబేగమ్(544), టిఎస్‌ఆర్‌ఎంం హైస్కూల్ నుంచి మునిపల్లి శివకామాక్షి(524), ఎస్‌డిఐఎం బాలికోన్నత పాఠశాల నుంచి పి.రూపశ్రీ(562), ఎస్‌ఆర్‌ఎస్‌ఎంబిహెచ్ నుంచి షేక్ నయీమ(561), ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూల్ నుంచి పల్లపు జయశ్రీ(538) ఉన్నారు. తన కుమార్తె రాధాకుమారి జ్ఞాపకార్థం కార్యక్రమం నిర్వహించిననట్లు చింపయ్య చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం ఆర్ వెంకటకృష్ణారావు, ఎస్‌బిఐ రిటైర్డ్ అసిస్టెంట్ మేనేజర్ బి.సుబ్బారావు, వై.శాంతిసుధ పాల్గొన్ని విద్యార్థులను అభినందించారు.



ప్రోత్సాహకాల పంపిణీలో బషీర్ అహ్మద్, చింపయ్య



పాఠశాలను సందర్శించిన ఉర్దూ డిఐ

మైనార్టీ విద్యార్థులందర్నీ బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని అన్ని ఉర్దూ మాధ్యమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి యం.డి.ఖాసిం తెలియజేశారు. గురువారం డిఐ పలు పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈనెల 15వ తేదీ వరకూ సెలబ్రేషన్స్, స్కూల్ విల్లింగ్‌నెస్ కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలను గుర్తించటం ఆవాస ప్రాంతంలోని ప్రతి ఇంటిని సందర్శించి, బాలికా విద్య ప్రాధాన్యత వివరించాలన్నారు. ఈనెల 16 నుండి 20వ తేదీ వరకూ వేడుక-విద్య కార్యక్రమంలో భాగంగా తరగతుల వారీగా విద్యార్థుల నమోదు, పాటల పోటీలు, ప్లే కార్డులు నినాదాలతో ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, డోర్ టు డోర్ ప్రచారం మొదలైన కార్యక్రమంలు చేపట్టాలన్నారు. 21 నుండి 29వ తేదీ వరకూ వేడుకలు-ప్రవేశాలు అనే అంశంలో భాగంగా నిర్దేశించిన విధంగా రోజువారీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మైనార్టీ పిల్లలు, కుటుంబాలు ఎక్కువగా నివశిస్తున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, వందశాతం నమోదు అయ్యేటట్లు చూడాలన్నారు.

మెడిటేషన్‌పై పరిశోధనా పత్రం సమర్పణ

ప్రజాశక్తి-గుంటూరు



తమిళనాడు టీచర్స్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ, శ్రీరామకృష్ణ బిటి కాలేజి సంయుక్తంగా చెన్నైలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో గుంటూరుకు చెందిన రీసెర్చ్ స్కాలర్ నల్లగొండ కుమార్ రాజా పాల్గొని పరిశోధనా పత్రం సమర్పించారు. మణిపూర్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ అయిన కుమార్‌రాజా రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ ఉషాకాటే పర్యవేక్షణలో 'డిజిటల్ కాలంలో రాజయోగ మెడిటేషన్ ప్రభావం' అనే అంశంపై పరిశోధనా పత్రం రూపొందించి, సదస్సులో సమర్పించారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, గుజ్జనగుండ్లలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలలో ముత్తూట్ ఫైనాన్స్, జోసిల్ లిమిటెడ్, జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, తిరుమల మిల్క్ ప్రొడక్ట్స్, రామకోటయ్య చిల్డ్రన్స్ హాస్పిటల్, లక్ష్మీ అసోసియేట్స్ కంపెనీ పాల్గొంటారన్నారు. టెన్త్, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, బి.టెక్, నర్సింగ్ అభ్యర్థులు, 18-35 ఏళ్ల వయస్సు కలిగిన వారు, తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఇతర వివరాల కోసం 9652065235, 9052438392 నంబర్లలో సంప్రదించాలన్నారు.



రిపోర్ట్ అందచేస్తున్న నాక్ పీర్ బృంద సభ్యులు

సెయింట్ ఆన్స్‌ను సందర్శించిన నాక్ బృందం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలను నాక్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ పీర్ బృందం 12, 13 తేదీల్లో సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణికి పీర్ టీమ్ సభ్యులు నాక్ చైర్మన్ డాక్టర్ దేవేందర్‌కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ ముఫీద్ అహ్మద్, టీమ్ సభ్యులు డాక్టర్ అంజలి కులకర్ణి నాక్ రిపోర్ట్ అందచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులను, సిబ్బందిని నాక్ పీర్ కమిటీ అభినందించింది.



వృద్ధులకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వయోవృద్ధులను.. అనాథలను అక్కున చేర్చుకుని ఆదరించడం అభినందనీయమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. పాత గుంటూరు లోని ఆర్ ఆర్ మూర్తి వృద్ధుల సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం చదలవాద గీత జ్ఞాపకార్థం వృద్దులకు వస్త్రాల పంపిణి కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ సేవా సంస్థ వృద్ధుల కు అనాథలకు ఆప్యాయంగా దగ్గర తీయడం గొప్ప విషయమన్నారు. రాలిపోయే వృద్ధులకు మేము ఉన్నామని చెప్పడం సంస్థ ఔన్నత్యానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో చదలవాద హరిబాబు, డాక్టర్ గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి!

- కిలో ఉల్లిగడ్డల ధర రూ.50
- పేద, మధ్య తరగతి ప్రజలపై భారం
- ధరల అదుపునకు విజ్ఞప్తి

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఉల్లిగడ్డలు తరిగితే ఆ ఘాటుకు కన్నీరు రావడం సహజం. ప్రస్తుతం కోయకుండానే ఉల్లిగడ్డలు కన్నీరు పెట్టిస్తున్నాయి. దీనికి కారణం ఉల్లిగడ్డల ధరలు మళ్లీ పెరగడమే. రెండు వారాల క్రితం వరకు కిలో ఉల్లిగడ్డల ధర రూ.15 నుంచి రూ.20 వరకు ఉండేది. ప్రస్తుతం ఉల్లి ధర ఏకంగా కిలో రూ.50కు ఎగబాగింది. నిన్న మొన్నటి వరకు తక్కువగా ఉన్న ఉల్లి ధరలు తాజాగా పెరగడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత రిటైల్ మార్కెట్లో కిలో ఉల్లిపాయల ధర రూ.45 నుంచి రూ.50 వరకు పలుకుతుంది. అక్కడితో ఆగ కుండా దీని ధర ఎగబాకుతూ ఉండడంతో సామాన్య ప్రజలు కొన లేకపోతున్నారు. ప్రతి కూరలోనూ ఉల్లిగడ్డలు తప్పని సరిగా వాడాల్సిందే కనుక దీని ధర పెరగడంలో మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉల్లి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గినట్లు తెలుస్తుంది.ఫలితంగా ఉల్లి ధర కొండెక్కి కూర్చుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. పైగా ఉల్లి ధరలు రోజు రోజుకీ పైకి ఎగబాకుతూ ఉండటాన్ని పరి గణనలోకి తీసుకొని వ్యాపారులు అక్రమ నిలవలు చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా గుంటూరు మార్కెట్ కు మహారాష్ట్రలోని సోలాపూర్, నాసిక్, పూణె, అహ్మద్‌నగర్ ప్రాంతాల నుంచి నిత్యము టన్నుల కొద్దీ ఉల్లి దిగుమతులు అవుతూ ఉంటాయి. ఈ మార్కెట్‌కు ప్రస్తుతం కేవలం దిగుమతి తగ్గిందని తెలుస్తుంది. అక్కడి నుండి

పెదకూరపాడు వ్యాపారులు ఉల్లిగడ్డలను దిగు మతి చేసుకుంటారు. గత వారం రోజులుగా ఉల్లి ధరలు మార్పులు వచ్చినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉల్లి ధర



మూడు రేట్లు పెరగటం గమనార్హం. అంటే కిలో ఉల్లి గడ్డలు 40 నుంచి 50 కి చేరుకుంది. మరోవైపు కూర గాయల ధరలు సైతం రెట్టింపు అయ్యాయి. ఎండల తీవ్రతకు కూరగాయల సాగుకు తీవ్ర నష్టం కలిగి చేశాయి. అధిక ఉష్ణోగ్రతలకు పూత మాడిపోయి దిగు బడులు పడిపోవడంతో ధరలకు రెక్కలు వచ్చాయి. ఇంకో వైపు పప్పు వంటి నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరగడంతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. ప్రస్తుతం ధర పెరగడంతో సామాన్యులకు ఉల్లి దూరం అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చొరవ తీసుకొని ఉల్లి ధరలను అదుపు చేయాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

భారంగా మారింది

శ్రీనివాసరావు, పెదకూరపాడు గ్రామస్తుడు



ఉల్లిగడ్డలు ధరలు పెరగడంతో కుటుంబం పై భారం జరిగిందని పెదకూరపాడు గ్రామానికి చెందిన శ్రీనివాస్ రావు అన్నారు. ఉల్లి పంట వచ్చే సమయంలో 10 నుంచి 20 రూపాయలు మాత్రమే సరుకు దొరికేది. పంట రాక తగ్గిపోవడంతో వ్యాపారులు తమ ఇష్టానుసారం ధరలు పెంచి అమ్ముతున్నారు. అధికారులు స్పందించి ఉల్లి ధరలు అరికట్టాలని కోరారు.

29 న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

ఈ నెల 29 ఐదవ శనివారం నాడు సత్తెనపల్లిలో ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ-అమరావతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ-గుంటూరు వారి ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా కమిటీ సత్తెనపల్లి ఆధ్వర్యంలో ఈ అదాలత్ జరగనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు కేసులు, మనోవర్తి కేసులు, సివిల్ తగాదాలు, రెవిన్యూ కేసులు ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు వివరించారు. కక్షిదారులు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ కేసులను పరిష్కరించుకోవాల్సిందిగా న్యాయమూర్తి విజ్ఞప్తి చేశారు.



ట్రోఫీని బహుకరిస్తున్న చిత్రం

ముగిసిన క్రికెట్ పోటీలు.. 'శివారాక్స్ 'విజయం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

శ్రీ వేద గాయత్రి పురోహిత సంఘం అధ్వర్యంలో మూడు రోజులు గా జరుగుతున్న క్రికెట్ పోటీలు గురువారం తో ముగిశాయి. సత్తెనపల్లి బ్రాహ్మణ పురోహితులు రెండు జట్లుగా ఏర్పడి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎపి కింగ్స్, శివారాక్స్ జట్ల మధ్య జరిగిన పోటీలో శివారాక్స్ జుట్టు విజయం సాధించింది. గెలుపొందిన జుట్టుకు క్రికెట్ బ్యాట్ ట్రోఫీని బహూకరించారు. సత్తెనపల్లి నియోజకవర్గ పురోహిత సంఘం అధ్యక్షులు ఎ.రాజశేఖర్ మారుతి పాల్గొన్నారు.



డాక్టర్ కొల్లా అమర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రముఖ పిల్లల వైద్యులు,స్నేహశీలి డాక్టర్ కొల్లా అమర్ 55వ పుట్టినరోజు వేడుకలను సోమేపల్లి సాం బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రగతి నర్సింగ్ హోమ్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. అమర్‌ను శాలువతో సత్కరించి కేక్ కట్ చేశారు. ఈ సంద ర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సోమేపల్లి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఇటు డాక్టర్‌గా పేదలకు వైద్య సేవ లం దించడమే కాకుండా అటు ప్రజా సమస్యలపై ఉద్యమాల్లో పాల్గొంటున్న కుటుంబమని కొనియాడారు. కరోన సమయంలో డాక్టర్ అమర్ చేసిన సేవలు మరువ లేనివన్నారు. అమర్ మాట్లాడుతూ సోమేపల్లి వెంకట సుబ్బయ్యకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. అమర్‌కు జి.లింకన్ , బైరా వెంకటకోటి, జి.ఆంజనేయులు, ఎన్. హనుమంత రావు, హిదయ తుల్లా,జమీర్ ,కళ్యాణ్, కరి ముల్లా, హమద్,రఫీ శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించండి

ఎంపికి ఆరోగ్య మిత్రల వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆరోగ్యమిత్రల వేతనాల పెంపు, ఇతర సమ స్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఆరోగ్య మిత్ర దళిత, గిరిజన, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి, కార్యదర్శి అప్పారావులు కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావు పేటలో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ తమ సమస్యలపై శ్రీకృష్ణదేవరాయలు సానుకూలంగా స్పందించారన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టడానికి ప్రధాన భూమిక పోషించిన ఆరోగ్యమిత్రలు సమస్యల వలయంలో చిక్కుకున్నారుని, విశేష సేవలు అందిస్తున్న ప్పటికీ వారి జీతాలలో, జీవితాలలో ఎదుగుదల లేద న్నారు. ఆరోగ్యమిత్రలను కాంట్రాక్ట్ లోకి మార్చి పర్మి నంట్ చేయాలని, హెచ్. ఆర్ పాలసి అమలుపరచాలని, గ్రూప్-3 లోని సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించాలని, మెడికల్ డిపార్ట్మెంట్ల మాదిరి మెడికల్ సెలవులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజ్ కల్పించాలని ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్ర కుటుంబాలకు ఇ.హెచ్.ఎస్ కార్డులు మంజూరు చేయాలన్నారు.



శ్రీకృష్ణదేవరాయలును కలిసిన ఆరోగ్య మిత్రలు

ఆరోగ్య మిత్రలకు అన్ని విభాగాలలో అర్హత మేరకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు సాయిబాబా రాజు, వెంకటేశ్వర్లు, అశోక్ ,సుధాకర్, నాగే శ్వరరావు పాల్గొన్నారు.

బంగారంపై వ్యవసాయ రుణాలు

ప్రజాశక్తి -పెదకూరపాడు

కేంద్ర సహకార బ్యాంకు, పెదకూరపాడు బ్రాంచ్‌లో (సొసైటీ బ్యాంక్) డిపాజిట్ పై సీనియర్ సిటిజన్‌లకు అత్యధిక వడ్డీ 8.75 శాతం ఇస్తున్నట్లు ఆ బ్రాంచ్ మేనేజర్ జమ్ములదిన్నె రవికుమార్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. మిగతా వారందరికీ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ 8.25 ఇస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులో మొబైల్ బ్యాంకింగ్ సౌకర్యం, లాకర్ సదుపాయం ఉందన్నారు.నెఫ్ట్, ఆర్టిడిఎస్, డిబిటి సిటిఎస్ సౌకర్యం ఉందన్నారు. గోల్డ్ లోన్ గ్రాముకు గరిష్టంగా ఐదువేల 100 వరకు ఇస్తున్నామన్నారు. వ్యవసాయ ప్రయోజనాలకు బంగారం తాకట్టుపై గ్రాము కు 4900 చొప్పున ఇస్తామన్నారు. గరిష్టంగా ఒక వ్యక్తికి మూడు లక్షల రూపాయల వరకు అవకాశం ఉందన్నారు. గహ , వాణిజ్య ప్రయోజనాల వరకు రుణాలు గరిష్టంగా 10 లక్షల వరకు ఇస్తున్నామని మేనేజర్ వివరించారు. ఈ అవకాశాన్ని పెదకూరపాడు మండల పరిధిలోని ప్రజలు వినియోగించు కోవాల్సిందిగా కోరారు.

తగ్గని ఉష్ణోగ్రతలు .. తప్పని ఉక్కపోత

ప్రజాశక్తి-చిలకలూరిపేట



వేసవి కాలంలో మండుటెండలతో రోహిణి కార్తె తన ప్రతాపాన్ని చూపించడమే కాక ఉక్క పోతతో జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. గడచిన మే 25వ తేదీన ప్రారంభమైన రోహిణి కార్తె జూన్ 8తో ముగిసింది. ఆ తర్వాత మృగశిర కార్తె రావడంతో వాతావరణం చల్లబడుతుందని ప్రజలు భావించారు. మృగశిర కార్తె వచ్చి ఐదు రోజులు కావస్తున్నా భానుడి ప్రతాపం మాత్రం తగ్గలేదు. ఉష్ణో గ్రతల తీవ్రత తగ్గలేదు. ఉక్క పోతా తప్పట్లేదు. వృద్ధులు, గర్భి ణులు, చిన్న పిల్లలు ఇబ్బంది పడు తున్నారు. మృగ శిర కార్తె వచ్చినా చల్ల దనం లేక పోవడంతో ప్రజలు నిట్టూరు స్తున్నారు. రెండు, మూడు రోజులుగా గాలిలో తేమ శాతం లేక వేడిగాలులు వీస్తున్నాయి.



లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు చెబుతున్న అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు

ఎమ్మెల్యే కన్నాకు అంగన్వాడీల సత్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన కన్నా లక్ష్మీ నారాయణను అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలిచిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయిం చారు. అనంతరం లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరిం చారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకురాలు బి. వందనాదేవి, టి.అంబికా, జి.సుశీల పాల్గొన్నారు.

పాఠశాలలు పున:ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పాఠశాలకు వెళ్తున్న
ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు

వేసవి సెలవులు అనంతరం గురువారం పాఠశాలలు తిరిగి ప్రారం భమయ్యాయి. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో పూర్తి స్థాయిలో ఉపా ధ్యాయులు ఉన్నట్లు ఇప్ప టికే విద్యా శాఖ అధికారులు ప్రకటించారు. కార్పోరేట్ పాఠశాలలో పుస్తకాలు, సమదుస్తులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్స్ అందుబాటులో ఉన్నాయి. తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే అధికారుల నుంచి పాఠశాలకు ఆదేశాలు అందాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలలు బుధవారం తిరిగిప్రారంభం కావాల్సి ఉండగా నూతన ప్రభుత్వం ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఒక రోజు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఐగ్రో ఇం టర్ నేషనల్ స్కూల్స్ చైర్మన్ పి.వెంకట్ మాట్లాడుతూ నరసరావుపేటకి చేరువలో చిలకలూరిపేట రోడ్డులో ప్రశాం తమైన వాతావరణంలో అత్యాధునిక నాణ్యతా ప్రమా ణాలతో నెలకొల్పిన తమ పాఠశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులతో సులభ రీతిలో బోధిస్తామన్నారు. విశాలమైన క్రీడా ప్రాంగణం, అత్యాధునిక తరగతి గదులు, ఒత్తిడి లేని విద్య తమ ప్రత్యేకమన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు.

వర్షపు నీరు నిలబడకుండా చూడాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు


అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వలన ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, డివిజన్ల వారీగా ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు.గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా మెడికల్ క్లబ్, నల్లచెరువు, బుడంపాడు బైపాస్, కాకాని రోడ్ రిలయన్స్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రైన్లలో జరుగుతున్న పూడిక తీత పనులను ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించి, తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వర్షం నీరు వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. వర్షాలకు ఎక్కడైనా నీరు నిలిస్తే ఆయా అధికారులే భాధ్యత వహించాలని స్పష్టం చేశారు. నగర పరిధిలోని ప్రధాన అవుట్‌ఫాల్ డ్రైన్లలో ఇప్పటికే పూడిక తీత పనులు జరుగుతున్నాయని, మిగిలిన ప్రాంతాల్లో కూడా పనులు ప్రారంభించడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పూడిక తీసే ప్రాంతాల్లో ఆక్రమణలు ఉంటే వెంటనే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించాలన్నారు. పూడికతీత పనులను ఎమినిటీ కార్యదర్శులు దగ్గర ఉండి పర్యవేక్షణ చేయాలని, పూడిక తీతకు ముందు, తర్వాత ఫోటోలు తీయాలన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో స్థానికుల సంతకాలు తీసుకోవాలని, డ్రైన్ పూర్తి లోతు వరకు పూడిక తీయాలన్నారు. పనుల వివరాలతో మ్యాప్ సిద్ధం చేయాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. అనంతరం ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులపై మరింత శ్రద్ధ పెట్టాలని, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. ఎక్కడా గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ ఉండడానికి వీలు లేదని, వ్యర్థాలు రోడ్ల మీద, డ్రైన్లలో వేయకుండా వీధి వ్యాపారులకు తెలియ చేయాలన్నారు. షాప్స్ ఎదుట డస్ట్ బిన్లు పెట్టుకోవాలని, లేకుంటే వారికి అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ. శ్యాం సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ(ఎఫ్ఏసి) మధుసూదన్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, కొండారెడ్డి, శ్రీనివాస్, ఏసిపి మురళి, ఎస్.ఎస్. లు ఆనందకుమార్, రాంబాబు, ఆయుబ్ ఖాన్, డిఈఈలు రమేష్ బాబు, రాము, శ్రీధర్, ఏఈలు, టిపిఎస్ లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతియుతం వాతావరణానికి సహకరించాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

గ్రామాలు సస్యశ్యామలంగా ఉండేలా ప్రజలంతా సహకరించాలని మేడికొండూరు మండల తహసిల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని పొట్లపాడు జంగంగుంట్ల పాలెం గ్రామ ప్రజలతో తహసిల్దార్ గురువారం సమావేశమయ్యారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామంలో జరిగిన ఘర్షణల గురించి తహసిల్దార్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రజలంతా సామరస్యంగా ఉండి ప్రశాంతమైన వాతావరణముతో ఉండేలా వివిధ పార్టీల నాయకులంతా సహకరించాలని ఆమె కోరారు.అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ హెచ్చరించారు. అనంతరం ఇరుగ్రామాల నాయకులతో కరచాలనం చేయించారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు సిఐ దార్ల జయకుమార్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రజలతో మాట్లాడుతున్న మేడికొండూరు తహశీల్దార్ రాజ్యలక్ష్మి

ఖరీఫ్ సాగుపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌బికె సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్


శిక్షణ కార్యక్రమంలో మాట్లాతున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

రైతుల వ్యవసాయానికి ప్రాధాన్యత పెరుగుతున్న ఖరీఫ్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా మెలాగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ పొదుపు భవన్లో గురువారం తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల ఆర్బికె సిబ్బందితో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బంది అమలు పరచబోయే ప్రణాళికపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పంట ప్రారంభదశలో రైతులకు సూచనలు చేయడంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తతో మెలగాలన్నారు. వ్యవసాయానికి ప్రాధాన్యత పెరుగుతున్న ఈ తరుణంలో విధులు నిర్వహిస్తున్న ఆర్బికె సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రైతులుకు అందుబాటులో ఉంటూ ఖరీఫ్ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించాలన్నారు. కౌలు రైతులను గుర్తించి వారికి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయించాలని పేర్కొన్నారు. రానున్న ఖరీఫ్‌లో అమలు పరచాల్సిన వ్యవసాయ పథకాలు పిఎం కిసాన్, రైతు భరోసా, పచ్చిరొట్ట, వరి విత్తనాల పంపిణి, సాయిల్ శాంపుల్ సేకరణపై పూర్తి అవగాహనతో తమ బాధ్యతలు నిర్వర్తించాలని తెనాలి మండల సహాయ వ్యవసాయ అధికారిణి ఎన్ ఉషారాణి సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల వ్యవసాయ అధికారులు జి ప్రేమ సాగర్, కె వెంకట్రావు, పి శిరీష, విఎఎ, విహెచ్ఎ, ఎఈఒ, ఎంపిఈఓలు పాల్గొన్నారు.

చిర్రావూరులో వైసిపి శిలాఫలకం ధ్వంసం

తీవ్రంగా ఖండించిన వైసిపి నాయకులు వేమారెడ్డి

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్


చిర్రావూరిలో శిలాఫలకం ధ్వంసం అయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

ఏంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు బుధవారం ధ్వంసం చేశారు.ధ్వంసం చేసిన విగ్రహం శిలాఫలకంను వైసీపీ ఏంటీఏం సి నగర అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి ఇతర వైసీపీ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు వేమారెడ్డి మాట్లాడుతూ విగ్రహాలు ధ్వంసం చేయడం సరైంది కాదని అన్నారు. ఇటువంటి చర్యలు మంచిది కాదని హితవు పలికారు. అనంతరం వైఎస్ఆర్సిపి నాయకులు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమం పట్టణ అధ్యక్షులు బుర్ర ముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, వైఎస్ఆర్సిపి తాడేపల్లి పట్టణ నాయకులు మేకా అంజి రెడ్డి, పాటి బండ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి శిలాఫలకం ధ్వంసం అకతాయిల పనే

టిడిపి నాయకులు వీరిశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి, జనసేన పార్టీ నాయకులు

చిర్రావూరులో బుధ వారం రాత్రి జరిగిన వైయస్సార్ విగ్రహ శిలాఫలకం టిడిపి, జనసేన నాయకులు చేశారనేది అవాస్తవమని టిడిపి చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం ఏం టీ ఎం సీ పరిధిలోని చిర్రావూరు టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వీరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విగ్రహాలు ధ్వంసం చేసే అలవాటు తమకు లేదని అన్నారు.ఆకతాయిలు చేసిన పనికి తామే చేశామని వైసిపి వారు చెప్పడం సరైంది కాదని అన్నారు. విగ్రహ ధ్వంసం టిడిపి, జనసేన చేసిందని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి లాల్ చంద్,ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్, జనసేన పార్టీ గ్రామ కమిటీ ఉపాధ్యాక్షులు పోకల శివయ్య, జట్టి రవేంద్ర బాబు పాల్గొన్నారు.


వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బిసిజి వ్యాక్సిన్‌తో క్షయ నివారణ

రాష్ట్ర నోడల్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్

ప్రజాశక్తి - తెనాలి

వృద్ధులకు ప్రాణాంతక క్షయ వ్యాధి సోకకుండా బిసిజి వ్యాక్సిన్ నివారిస్తుందని రాష్ట్ర ఆర్బిఎస్కె నోడల్ ఆఫీసర్, జిల్లా పరిశీలకులు కె ప్రశాంత్ కుమార్ అన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలోని సచివాలయాలలో ఏర్పాటు చేసిన అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఎళ్ళ వయసు పైబడిన మధుమేహం, టిబి వ్యాధిగ్రస్తులు కూడా ఈ వ్యాక్సిన్ చేయించుకోవచ్చన్నారు .ఆయన వెంట తెనాలి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఇ అన్నపూర్ణ, ఆరోగ్య సిబ్బంది పి వెంకటేశ్వరమ్మ, టి అరుణ, వాణి, శివకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పెదనందిపాడు, నాగులు పాడు, అనపర్రు, కొప్పర్రు, రాజుపాలెం, పాలపర్రు మరియు అన్నవరం గ్రామాలలో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎఇ అంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నము 2 గంటల వరకు 11 కెవి విద్యుత్ లైన్ ల మరమ్మతులు మరియు ట్రీ కటింగ్ పనుల నిమిత్తం విద్యుత్ నిలిపి వేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించవలసినదిగా ఎఇ కోరారు.


పాలెపు రామారావును సన్మానిస్తున్న అన్నదాన నిర్వాహకులు

4500 మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా, గురువారం ముఖ్యమైన ఐదు ఫైల్స్‌పై సంతకాలు పెట్టి పాలనా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పెనుమాకలో 4,500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జాతీయ అభిమాన సంఘం అధ్యక్షులు పాలెపు రామారావును శాలువాతో ఘనంగా సత్కరించారు. పెనుమాక ప్రథమ సొసైటీ అధ్యక్షులుగా పని చేయడంతో పాటు సినీ ఇండస్ట్రీకి ముఖ్యంగా ఎన్‌టిఆర్ జాతీయ అభిమాన సంఘం అధ్యక్షులుగా పని చేశారని టిడిపి మండల అధ్యక్ష, కార్య దర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు అభినందించారు. ఇకపై అమరావతిలో పాలన దిగ్విజయంగా కొనసాగుతుందని హామీనిచ్చారు. రైతులకు బకాయి ఉన్న వార్షిక బకాయిలు కూడా త్వరలోనే రైతుల బ్యాంకు అకౌంట్లో జమ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళ్లం రాజశేఖరరెడ్డి, పటాన్ జానీఖాన్, టిడిపికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



రాజధాని రైతులకు చంద్రబాబు అభివాదం

చంద్రబాబుకు ఘన స్వాగతం పలికిన రాజధాని రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి లో చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టేందుకు ఉండవల్లి లోని కృష్ణానది కరకట్ట వద్ద తన స్వగహం నుంచి వెలగపూడిలోని సచి వాలయంకు బయలు దేరగా రాజధాని రైతులు, టిడిపి నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వెంకటపాలెం లోని సీడ్ యాక్సెస్ రోడ్డు వద్ద రైతులు చంద్రబాబుకు గజమాలతో ఆహ్వానం పలికారు. చంద్రబాబు కాన్వాయ్ వెంట పరుగులు తీశారు. వెంకటపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు దగ్గర నుంచి సచివాలయం వరకు కాన్వాయ్ ని అనుసరించారు. దారి పొడవునా పూలు జల్లుతూ జై బాబు అంటూ కేరింతలు కొట్టారు .పూలతో రోడ్లన్నీ పసుపుమయంగా మారాయి. ఓ రైతు అందజేసిన ఆకుపచ్చని కండువాను చంద్రబాబు మెడలో వేసుకొని రైతులకు అభివాదం చేశారు. టిడిపి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై చంద్రబాబును అనుసరించారు. మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి రైతుల ఆనందోత్సాహాలలో పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



ప్రజలు, నాయకుల అంచనాలకు తగిన విధంగా పనిచేస్తానని, ప్రజా సమస్యలను పరిష్కరించే ఏ ఒక్క అవకాశాన్నీ వదిలిపెట్టనని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయక మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఢిల్లీలోని సంచార్ భవన్‌లో కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రిగా గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కార్యాలయంలోకి అడుగుపెట్టిన ఆయనకు ఆహ్వానం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన గుంటూరులోని మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే క్రమంలో అందరి సహకారం ఉండాలని, తమ మేధస్సును రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉపయోగించాలని అధికారులను కోరినట్లు పేర్కొన్నారు. క్యాబినెట్ మంత్రులు జ్యోతిరాధిత్య సింధియా, శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి పనిచేయడం ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు.

రవిచంద్రను కలిసిన కలెక్టర్, ఎస్పీ



ప్రజాశక్తి-గుంటూరు

వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన యం.రవిచంద్రను జిల్లా కలెక్టర్ యం.వేణు గోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పి తుషార్ దూడిలు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

డిఎస్‌సి ప్రకటన హర్షణీయం : యుటిఎఫ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజే తొలి సంతకం డీఎస్సీ విడుదల చేస్తున్నట్టు చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ తరపున హర్షం వ్యక్తం చేస్తున్నట్లు యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పి ప్రేమ్ కుమార్, జి విజయ సారథిలు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన డీఎస్సీ ప్రకటన ద్వారా 16347 టీచర్ల పోస్టులు భర్తీ కానున్నాయని రాష్ట్రంలో ప్రస్తుతం 25 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ పోస్టుల సంఖ్యను ఇంకా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గడిచిన 5 ఏళ్లలో ఒక డీఎస్సీ లేదని గరిష్ట వయోపరిమితి 44 ఏళ్ల నుండి 47 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 117 ద్వారా పల్నాడు జిల్లాలో అనేక ప్రాథమిక పాఠశాలలోని సెకండరీ గ్రేడు పోస్టులు రద్దు చేశారని ప్రస్తుత అధికారం చేపట్టిన నూతన ప్రభుత్వం భర్తీ చేయడం సంతోష కరంగా ఉందన్నారు. విద్య పరంగా వెనుకబడిన పల్నాడు జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేసేలా ఉపాధ్యాయుల కృషిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

కెరీర్ ఎడ్యుకేషన్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఎంపిక చేసిన 20 పాఠశాలల్లోని 70 మంది ఉపాధ్యాయులు, 20 మంది ప్రధానోపాధ్యాయులు, నలుగురు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజి అధ్యాపకులకు కెరీర్ ఎడ్యుకేషన్ శిక్షణ కార్యక్రమం గురువారం స్థానిక భాష్యం హైస్కూల్లో నిర్వహించారు. గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసు సిఇఒ రాక్వెల్ ప్రాప్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ లో డిఇఒ పి.శైలజ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కెరీర్‌ను ఎంపిక చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. పాఠశాలల్లో కెరీర్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వియలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, ఏఎంఒ ప్రసాద్, ఏఎస్ఒ జయశంకర్, ట్రైనర్లు మంజునాథ, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలి

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ గురువారం స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పాఠశాల క్యాచ్‌మెంట్ ఏరియాలో డ్రాపౌట్స్ లేకుండా చూసుకోవాలని, బడిఈడు పిల్లలు అందరూ పాఠశాలలో నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విదంగా ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు నమ్మకం కలిగే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. గత సంవత్సరం మంచి ఫలితాలను సాధంచిన విషయం, ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించాలన్నారు. విద్యార్థుల నమోదు కార్యక్రమం వేగవంతంగా జరపాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అడ్మిషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డిఇఒ

వడివడిగా బడికి..

ప్రజాశక్తి-తెనాలి

వేసవి శలవుల అనంతరం పాఠశాలలు గురువారం పున: ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 23న పాఠశాలలకు వేసవి శలవులు ప్రకటించిన ప్రభుత్వం, ఈనెల 12న పాఠశాలల పున:ప్రారంభాన్ని ప్రకటించింది. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి గా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం కూడా అదే రోజున ఉండటంతో, ఆ రోజు కూడా ప్రభత్వం పాఠశాలలకు శలవు ప్రకటించిన సంగతి తెలిసిందే. తొలిరోజున ఉన్నత పాఠశాలల విద్యార్థులు కొందరు నూతన వస్త్రాలతో హుషారుగా పాఠశాలకు రావటం కనిపించింది. అలాగే ప్రాథమిక స్థాయి విద్యార్థులు కొందరు పాఠశాలకు వెళ్లేందుకు నిరాకరించటం, తల్లిదండ్రులు బలవంతంగా పాఠశాలకు తీసుకువెళ్ళడం వంటి దృశ్యాలు కనిపించాయి.



తొలిరోజు ఉత్సాహంగా పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల్ని రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలని, 13న పాఠశాలలు తెరిచినప్పటికీ ఇంత వరకూ నూతన విద్యాసంవత్సరానికి సంబంధించిన రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వలేదని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. గురువారం కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో 149 మోడల్ స్కూల్స్, పల్నాడు జిల్లాలో 14 స్కూల్స్ ఉన్నాయని 6 నుండి 12వ తరగతి వరకూ ఇంగ్లీషు మీడియంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని అన్నారు. వీటిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన విద్యామంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పారు. మోడల్ స్కూల్స్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

డేటాసైన్స్‌లో విస్తృత పరిశోధనలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ రాశేఖర్

విద్యార్థులందరూ డైటాసైన్స్‌పై విస్తత పరిశోధనలు చేయాలని ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మేథమ్యాటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ మేథమెటిక్స్ స్టాటిస్టిక్స్‌లో ప్రావీణ్యం పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో డేటాసైన్స్‌ను పరిశోధనాంశంగా ఎంచుకోవాలన్నారు. ప్రస్తుతం అన్ని మల్టీ నేషనల్ కంపెనీలు డేటాసైన్స్‌ను విరివిగా వినయోగిస్తున్నారని, కాబట్టి ఇందులో ప్రావిణ్యం పొందిన విద్యార్థులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ సమాచారం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుందని, విద్యార్థులు అప్‌డేట్ అయితేనే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలరని, నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మార్చుకోవాలని సూచించారు. కేవలం విద్యాపరమైన పరిజ్ఞానానికే పరిమితం కాకుండా వీలైనన్ని కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో హాజరైన సౌది అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నబిల్ మలైకీ విద్యార్థులకు ఆల్‌జీబ్రాలో వస్తున్న సరికొత్త డెవలప్‌మెంట్స్‌ను నిత్యజీవితంలో ఎలా వినియోగించాలో తెలియజేశారు. అలాగే ఆన్‌లైన్‌లో మరో ముఖ్య అతిథిగా హాజరైన లెబనాన్‌లోని లెబనీస్ అమెరికన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జుల్కర్‌మైన్ సబిర్ విద్యార్థులకు న్యూమరల్ నెట్‌వర్క్ సిస్టమ్‌లోని మెళకువలను వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.